


# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

SRI TV

గురువారం, 16 మే 2024






## శ్రీ మోదీకి, బీజేపీ నాయకత్వానికి, శ్రీ అరుణ్ కుమార్ సక్సేనాకి కృతజ్ఞతలు

శతఘ్ని న్యూస్: దేశంలో అత్యంత పవిత్ర పుణ్య క్షేత్రం, శైవ క్షేత్రమైన వారణాసిలో జరిగిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి నన్ను ఆహ్వానించినందుకు శ్రీ నరేంద్ర మోదీ గారికి, బిజెపి అధినాయకత్వానికి నా కృతజ్ఞతలు అంటూ జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా కాశీలోని విశ్వేశ్వరునికి అభిషేకం, ఆ దివ్య క్షేత్రం సందర్శనకు సహకారం అందించిన బిజెపి ఉత్తరప్రదేశ్ శాఖ నాయకులకు, ముఖ్యంగా నా పర్యటన భక్తిపూర్వకంగా సాగడానికి వెన్నంటి ఉన్న యు.పి. రాష్ట్ర అటవీ శాఖా మంత్రి శ్రీ అరుణ్ కుమార్ సక్సేనా గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు అని జనసేనాని పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద బలంగా నిలబడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు



–జూన్ 4 వేడుకలకు సిద్ధం అవ్వండి

–శ్రీమతి వంగా గీత గారిని గౌరవించండి

–జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నాగబాబు

శతఘ్ని న్యూస్: 'శ్రీ పవన్ కళ్యాణ్ గారు పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటన వెలువడిన దగ్గర నుంచి ఈవీఎంలో ఆఖరి ఓటు పడేవరకు అలుపెరగకుండా కృషి చేసిన ప్రతీ జనసేన నాయకుడికీ, జన సైనికుడికీ, వీర మహిళకు అభినందనలు అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నాగబాబు గారు తెలిపారు. బుధవారం గొల్లప్రోలు సత్యకృష్ణ రెసిడెన్సీలో జరిగిన పిఠాపురం కార్యకర్తల కృతజ్ఞత సమావేశంలో శ్రీ నాగబాబు గారు మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద బలంగా నిలబడిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో జరిగే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు తయారవ్వాలని పిలుపునిచ్చారు. ప్రత్యర్థిగా పోటీ చేసిన శ్రీమతి వంగా గీత గారికి గౌరవం ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. వైసీపీ అహంకారం అంతం కానున్నదని, జూన్ 4 వేడుకలకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీ బి. మహేందర్ రెడ్డి, శ్రీ వేములపాటి అజయ్ కుమార్, శ్రీ మర్రెడ్డి శ్రీనివాస్, డాక్టర్ సందీప్ పంచకర్ల, శ్రీ తుమ్మలపల్లి రమేష్, శ్రీ అనిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు దిగ్భ్రాంతి కలిగించాయి



శతఘ్ని న్యూస్: ఆంధ్రప్రదేశ్ లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా పసుమర్రు దగ్గర బస్సు, టిప్పర్ ఢీ కొని అగ్ని జ్వాలలు ఎగసి పడటంతో ఆరుగురు దుర్మరణం పాలవడం దురదృష్టకరం. అక్కడ బైపాస్ రోడ్ పనులు సాగుతున్న క్రమంలో తగిన రహదారి భద్రత చర్యలు తీసుకోవడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టి ఉంటే ఈ ఘోరం సంభవించి ఉండేది కాదు. డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఊడిమూడి దగ్గర ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో నలుగురు జట్టు కూలీలు మృత్యువాతపడటం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రహదారి ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జనసేనాని కోరారు.

## సర్ ఆర్థర్ కాటన్ స్ఫూర్తితో అడుగులు వేయాలి



శతఘ్ని న్యూస్: గోదావరి తీరం పచ్చటి మాగాణంగా కళకళలాడుతోందీ అంటే దానికి కారణం సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడు అకుంఠిత దీక్షతో ఆనకట్ట నిర్మాణం చేపట్టడం, సాగు నీటి కాలువలు తవ్వించడమే అని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో శ్లాఘించారు. అందుకే గోదావరి డెల్టా ప్రజలు నేటికీ గోదావరి పుణ్య స్నానం ఆచరించేటప్పుడు కాటన్ ను తలచుకొని ప్రణామాలు అర్పిస్తారు. ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేసేవారిని తరతరాలు తలచుకొంటాయని చెప్పడానికి కాటన్ జీవితమే తార్కాణం. నేడు ఆ జలప్రదాత జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నాను. ధవళేశ్వరం ఆనకట్ట, కాలువల నిర్మాణంలో బ్రిటిష్ పాలకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా వాటిని అధిగమించి అనుమతులు పొంది నిర్మాణాలను పూర్తి చేశారు. గోదావరి డెల్టాలోనే కాదు – కృష్ణా, తుంగభద్ర తీరాల్లోనూ కాటన్ చేసిన ప్రాజెక్టులు ఉన్నాయి. జల వనరుల ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ విషయంలో పాలకులు, అధికారులు, ఇంజినీర్లు సర్ ఆర్థర్ కాటన్ స్ఫూర్తిని అందుకోవాలని జనసేనాని సూచించారు.

## దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: రెడ్డి అప్పల నాయుడు



శతఘ్ని న్యూస్: ఏలూరులో సార్వత్రిక ఎన్నికలు జరిగీ రెండు రోజులు పూర్తయిన కూడా ఇంకా ఏలూరు నియోజకవర్గంలో పరస్పర దాడులు ఆగకపోవడంతో నియోజకవర్గ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని రెడ్డి అప్పల నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ఎన్నడూ జరగని విధంగా పరస్పర దాడులతో పెట్రేగిపోయారని 13వ తేదీ ఎన్నికల రోజునే పోణంగిలో జరిగిన సంఘటన దీనికి ఉదాహరణ అన్నారు. అంతేకాకుండా మంగళవారం రాత్రి కూడా కోడి కత్తులతో, సీసా పెంకులతో దాడులు చేయడం, కార్యకర్తల్ని గాయపరచుకోవడం చాలా బాధాకరమని, తక్షణమే పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలని రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, బాధ్యులపై తగు చర్యలను తీసుకోవాలని సూచించారు. ఎంతో ప్రశాంతంగా ఉండే ఏలూరు నియోజకవర్గంలో ఈ విధమైన పరిణామాలు జరగడం చాలా బాధాకరమని అన్నారు. మరో 20 రోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత గెలిచిన శాసనసభ్యులు ఇటువంటి సంఘటనలు అరికట్టే విధంగా, ప్రజలకు రక్షణ కల్పించాలని నాయకులను రెడ్డి అప్పలనాయుడు కోరారు.

## వైసీపీకి ఓటమి తప్పదు... అసహనంతోనే హింసకు పాల్పడుతున్నారు




శతఘ్ని న్యూస్: రాష్ట్రంలో ఓటర్లు విజ్ఞతతో ఓట్లు వేశారు. 81.86 శాతం పోలింగ్ నమోదు కావడమే ఇందుకు నిదర్శనం అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.నాగబాబు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వైసీపీ పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు కలిగించేందుకు.. బెదిరింపులకు, దాడులకు పాల్పడ్డా ఓటర్లు వెనుకంజ వేయకుండా తమ హక్కును వినియోగించుకున్నారు. ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందో వైసీపీవాళ్ళకు అర్థమైంది. ఓటమి కళ్ల ముందు కనిపిస్తుండటంతో అసహనం పెరిగిపోయి హింసకు పాల్పడుతున్నారు. ఓటర్లపై వైసీపీ వారు కక్షగట్టినట్లుగా ఉన్నారు. పోలింగ్ అనంతరం కూడా ప్రజలను వేధిస్తూ దాడులు చేస్తున్నారు. వైసీపీ డి.ఎన్.ఏ.లో హింస అనేది ఉందని మరోసారి వెల్లడవుతోంది. పల్నాడు జిల్లాలో మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల్లో వైసీపీ విశృంఖలంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. చంద్రగిరి నియోజకవర్గం కూటమి అభ్యర్థి శ్రీ పులివర్తి నానిపై హత్యాయత్నానికి పాల్పడటం వైసీపీ హింసకు పరాకాష్టగా మారింది. అదే విధంగా ఆళ్లగడ్డ నియోజకవర్గం కూటమి అభ్యర్థి శ్రీమతి అఖిలప్రియ గన్ మెన్ పై దాడికి దిగారు. తాడిపత్రిలో అశాంతి రేపారు. పోలింగ్ రోజున రైల్వే కోడూరు నియోజక వర్గంలో జనసేన ఏజెంట్లను అపహరించి తీవ్రంగా గాయపరిచారు. శ్రీ నక్కల సుబ్రహ్మణ్యం కంటికి తీవ్ర గాయమైంది.

* స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర భద్రత పెంచాలి

హింసకు పాల్పడ్డ వైసీపీ వాళ్ళే ఎన్నికల సంఘాన్ని, పోలీసులను నిందించడం విడ్డూరంగా ఉంది. దొంగే దొంగ అని అరిచినట్టుగా ఉంది. పోలింగ్ అనంతరం హింసపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర భద్రతను మరింతగా పెంచాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తున్నాము. జూన్ 4 రోజున వచ్చే ప్రజా తీర్పుతో వైసీపీ మరోసారి హింసకు పాల్పడే అవకాశం ఉంది. ఆ రోజున పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నాము అని శ్రీ నాగబాబు పేర్కొన్నారు.

శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 16 మే 2024




# కుటమి నాయకులే లక్ష్యంగా అరాచక మూకల దాడులు



శతఘ్ని న్యూస్: చిలకలూరిపేట: ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హింసాయుత పరిస్థితులు నెలకొనడం, విధ్వంసకర సంఘటన సంఘటనలు చెలరేగటం, కూటమికి చెందిన వ్యక్తులు గాయపడటం అత్యంత బాధాకరమని జనసేన సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్, ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులు పెంటేల బాలాజి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా వైసీపీ రాక్షస మూకల రక్తదాహం తీరలేదన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల తీవ్ర స్థాయిలో హింసాకాండకు, విధ్వంసానికి పాల్పడ్డారని వివరించారు. ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి: కూటమి నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగారని వెల్లడించారు. వైసీసీ నాయకులకు కొంతమంది అధికారులు, పోలీసులు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికలకు ముందే ఏ ప్రాంతాల్లో గొడవలకు కారణమౌతాయన్న విషయాన్ని గుర్తించి, ఆ పోలింగ్ కేంద్రాలు, గ్రామల పరిధిలో ప్రత్యేక బలగాలు దించటం, ఇతర ముందస్తు చర్యలు తీసుకుంటారని వివరించారు.కాని ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ఇందుకు భిన్నంగా ఉందన్నారు. వివాదాలు, ఘర్షణలను అదుపు చేయలేక పోయారని, అనేక ప్రాంతాలలో వైసీపీకి వ్యతిరేకంగా ఓటేసిన వారికి రక్షణ కరువైందన్నారు. వైసీసీ మూకలు రాష్ట్రంలో అనేక చోట్ల తీవ్ర స్థాయిలో హింసాకాండకు, విధ్వంసానికి పాల్పడ్డారని వెల్లడించారు. ఐదేళ్ల హింసా రాజకీయాలకు ప్రజలు సోమవారమే స్వస్తి పలికారని,. జూన్ 4న ఓట్ల లెక్కింపు మొదలయ్యాక రెట్టింపు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాడులకు పాల్పడ్డ వారిపై ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్సు ప్రమాదంపై దిగ్ర్భాంతి: చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంపై బాలాజి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమదంలో ఆరుగురు మృతి చెండటం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

## కష్టంలో ఉన్న కుటుంబానికి అండగా తెలుగుదేశం నాయకులు



శతఘ్ని న్యూస్: ఏలూరు జిల్లా, ద్వారకా తిరుమల మండలం, గుణ్ణంపల్లి పంచాయతీ గుణ్ణంపల్లిలో ఇటీవల కాలంలో నల్లజర్ల హైవే రోడ్డుపై యాక్సిడెంట్ లోగున్నంపల్లి గ్రామానికి చెందిన ఓకే కుటుంబంలో ఇద్దరు ఒకరు మరణం రెండో వారు చికిత్స నిమిత్తం ఏలూరు హాస్పిటల్ లో ఉన్నారు. గున్నూరి ముసలయ్య మరియమ్మల రెండవ సంతానం చనిపోయిన రెండు సంవత్సరాల చిన్నారి మగ బిడ్డ మరియు గున్నూరి సుబ్బారావు మరియమ్మల కుమారుడు చందద్రావు యాక్సిడెంట్లో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో ఉన్నారు. ఇది తెలుసుకున్న గుణ్ణం పల్లి కాపురస్తులు గున్నూరు వారి కుటుంబానికి తీర్చలేని లోటు జరిగింది. కనుక వెంటనే స్పందించి. చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించి, గున్నంపల్లి తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు సంక్రాంతి శ్రీనివాస్ రావు, సంక్రాంతి రాంబాబు (5000/-) రూపాయల ఆర్థిక సహాయం అందించి ఉన్నారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమడోలు అశోక్, గుణ్ణంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ హస్బెండ్ తాని గడప రమేష్. జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు దుక్కిపాటి చరణ్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు జనసేన పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఉన్నారు.

## రంపచోడవరం గడ్డపై ఎన్డీఏ కూటమి జెండా ఎగరేయబోతున్నాం

శతఘ్ని న్యూస్: రంపచోడవరం: మారేడుమిల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు మల్లా దుర్గ ప్రసాద్ ఉపాధ్యక్షులు బిశెట్టి సత్యకుమార్ మాట్లాడుతూ సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ లో ఎన్డీఏ కూటమి అఖండ మెజారిటీతో కోసం అలుపెరగని శ్రమించి పోలింగ్ ఏజెంట్ నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి తెలుగుదేశం కుటుంబ సభ్యులకు జనసేన కుటుంబ సభ్యులకు, బిజెపి కుటుంబ సభ్యులకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.



## ఫ్యాక్షన్ విష సంస్కృతికి తెరలేపిన వైకాపా

శతఘ్ని న్యూస్: ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలో గెలుపు ఓటములు సహజమని, అపజయం తప్పదనే సంకేతాలతో వైకాపా తన ఫ్యాక్షన్ విష సంస్కృతికి తెరలేపి జనసేన పార్టీ నాయకులపై, సానుభూతిపరులపై దాడులకు పాల్పడటం, భయభ్రాంతులకు గురిచేయడం స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కు తగదని జనసేన పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల రోజున అవనిగడ్డ మండల బందలాయిచెరువు గ్రామంలోని 154 వ నంబర్ పోలింగ్ బూత్ లో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు జనసేన పార్టీ పోలింగ్ బూత్ ఏజెంట్లపై దాడులకు పాల్పడి, బెదిరింపులకు గురిచేయడాన్ని శేషుబాబు తీవ్రంగా ఖండించారు. రెండు లక్షలకు పైగా ఓటర్లకు ప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యేకు ప్రజల పట్ల ఎలా వ్యవహరించాలో తెలియదా అని శేషుబాబు ప్రశ్నించారు. సొంత గ్రామంలో సైతం తనకు ఓట్లు పడటం లేదని గ్రహించిన ఎమ్మెల్యే సొంత ఊరు మనుషులపై దౌర్జన్యం చేసి భయానక వాతావరణం సృష్టించడం మంచి పద్ధతి కాదని, ఇప్పటికైనా విష సంస్కృతిని వీడి ప్రజాక్షేత్రంలో జీవించాలని శేషుబాబు హితవు పలికారు. అదేవిధంగా బందలాయిచెరువు గ్రామంలో జనసేన పార్టీ నాయకులపై కానీ, జనసైనికులపై కానీ, సానుభూతిపరులపై కానీ, వారి ఆస్తులకు గాని ఏదైనా నష్టం జరిగితే దానికి సింహాద్రి రమేష్ బాబు పూర్తి బాధ్యత వహించాలని శేషుబాబు డిమాండ్ చేశారు. భయాన్ని వీడి స్వేచ్చా వాతవరణంలోకి అడుగుపెట్టేందుకు ఓటు హక్కుని వినియోగించుకున్న ప్రజలకు, పోలింగ్ సక్రమంగా జరిగేందుకు సహకరించిన అధికారులకు, పోలీసు సిబ్బందికి, పాత్రికేయులకు ధన్యవాదములు తెలియచేసారు. జనసేన పార్టీ బందలాయిచెరువు గ్రామ పార్టీ అధ్యక్షులు కమ్మిలి మారి బాబు మాట్లాడుతూ రాబోయే రోజులలో తనకు కానీ, తన కుటుంబ సభ్యులకు కానీ, తనకు సంబందించిన ఆస్తులకు గానీ ఏదైనా ప్రమాదం జరిగితే దాని పూర్తి బాధ్యత సింహాద్రి రమేష్ బాబు కారణమని అన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వచ్చి తమపై దాడి చేయడం, బెదిరింపులకు గురిచేయడం ప్రజలందరూ గమనించారని, ఎన్నికలు పూర్తయి 3 రోజులు గడిచినప్పటికి కూడా తమను తమ గ్రామంలో ఇంకా బెదిరిస్తున్నారని వాపోయాడు. తమకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వలన హాని కలిగే అవకాశం ఉందని మారిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గుడివాక రామాంజనేయులు, రంగిశెట్టి ప్రభాకర్, సింహాద్రి మోక్షనందం (బుజ్జి), సనకా గోపాలరావు, గరికిపాటి సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి సుబ్బారావు, కోసూరు అవినాష్, పాలేపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

